క్లుప్తంగా

దత్తభక్తుల ఆధ్వర్యంలో షేర్ యువర్ ఫుడ్



నాగాయలంక: దత్త హ్యూమన్ సర్వీసు వలంటీర్లు, మండల దత్త భక్త బృందం ఆధ్వర్యంలో షేర్ యువర్ ఫుడ్, అన్నసేవ–సచ్చిదానందసేవ కార్యక్రమం పేరుతో నాగాయలంక ప్రధాన కూడలిలో ఆదివారం బాటసారులకు 200 లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు. మైసూరు దత్తపీఠాధిపతి శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ మాతృమూర్తి జయలక్ష్మీమాత జన్మదినోత్సవం పురస్కరించుకుని మండల దత్త భక్తుల ఆర్థిక సౌజన్యంతో కార్యక్రమం జరిపారు. తొలుత దత్త సేవకురాలు తుంగల సీతా మహాలక్ష్మి మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు చిట్టా సాంబశివరావు, శివ నాగేశ్వరరావు, అన్నపూర్ణయ్య, చిట్టా శేఖర్, దత్త వలంటీర్లు, వాసవీ సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలకు ఏర్పాట్లు

గూడూరు: మండలంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తహసీల్దార్ ఎస్ఎస్ శాంతి తెలిపారు. ఆదివారం ఆమె మండలంలోని ఆకులమన్నాడు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం ఏడు గంటల నుంచి ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లకు కనీస సౌకర్యాలు కల్పించామన్నారు. ఓటర్లు ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



మచిలీపట్నంటౌన్: పేద విద్యార్థులు విద్య ద్వారానే ఉన్నత శిఖరాలు అధిరోహించగలుగుతారని ఆది వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిల్లారి శెట్టి శ్రీనివాసరావు అన్నారు. పదో తరగతి ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆది వెలమ కుల విద్యార్థినీ విద్యార్థులు విద్యపైనే దృష్టి సారించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సంఘ నేతలు పిల్లారి శెట్టి సత్యనారాయణ, సూర్యకుమార్, ఉమామహేశ్వరి, ఈశ్వర్, ఆంజనేయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

పాపవినాశనం(ఘంటసాల): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడి మృతి చెందాడు. సేకరించిన వివరాల మేరకు ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామానికి చెందిన నలుకుర్తి బాబు (35) విజయవాడలో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ అక్కడే నివసిస్తున్నాడు. ఈ నెల 8వ తేదీన పాపవినాశనం నుంచి కొడాలికి ద్విచక్ర వాహనం పై వెళుతుండగా కుక్కలు ఒక్కసారిగా అడ్డురావడంతో అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన బాబును మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. నలుకుర్తి బాబు మృతదేహానికి ఆదివారం స్వగ్రామమైన పాపవినాశనంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య, ఆరు నెలల బాబు ఉన్నారు.

132 మంది పోలీసులతో బందోబస్తు

చల్లపల్లి: చల్లపల్లి సర్కిల్ పరిధిలోని మూడు మండలాల్లో 132 మంది పోలీసులతో ఎన్నికల విధులు నిర్వహించనున్నట్లు సీఐ సీహెచ్ నాగ ప్రసాద్ తెలిపారు. డీఎస్పీ, ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెచ్సీలు, కానిస్టేబుల్స్ మొత్తం 132 మంది ఎన్నికల విధుల్లో ఉంటారని వివరించారు. వీరితో పాటు ఎన్సీసీ వలంటీర్లు, డీఎస్పీ ఆధ్వర్యంలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, మండలానికి ఐదు రూట్లలో మొబైల్ బృందాలు పని చేస్తాయన్నారు.

సిబ్బంది సహకరించాలి

పామర్రు: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేలా సిబ్బంది సహకరించాలని పామర్రు నియోజకవర్గ ఎన్నికల అబ్జర్వర్ నరహరసింగ్ అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డులో ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. పోలీసు యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు నిర్వహించి, పోలీస్ పెట్రోలింగ్ సిబ్బందికూడా గస్తీ నిర్వహించనున్నారన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం



పెడన ఏఎంసీలో ఎన్నికల సామగ్రిని పరిశీలించుకుంటున్న పోలింగ్ సిబ్బంది



పెడనలో పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలిస్తున్న మచిలీపట్నం పార్లమెంటు పరిశీలకులు జాన్ కింగ్స్‌లే, పెడన ఈఆర్వో వెంకటరమణ

- అవనిగడ్డ నియోజకవర్గంలో 2,11,932 మంది ఓటర్లు
- తొలిసారి ఓటు హక్కు పొందిన వారు 4,572 మంది
- వందేళ్లు దాటినవారు ఏడుగురు
- 267 పోలింగ్ బూత్‌లు
- పోలింగ్ కేంద్రాలకు చేరిన ఎన్నికల సామగ్రి, సిబ్బంది
- 600 మంది పారామిలటరీ, స్థానిక పోలీసులతో బందోబస్తు
- ఎదురుమొండి దీవులకు పడవలో చేరిన సచివాలయ సిబ్బంది



పోలింగ్ సామగ్రితో పంపిణీ కేంద్రం నుంచి బయల్దేరిన పోలింగ్ సిబ్బంది

అవనిగడ్డ: సార్వత్రిక ఎన్నికలకు అవనిగడ్డ నియోజకవర్గం సిద్ధమైంది. సోమవారం జరగనున్న ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ సామగ్రి, సిబ్బందిని ఆయా పోలింగ్ కేంద్రాలకు పంపించారు. మొత్తం 2,168 మంది పోలింగ్ అధికారులు, సిబ్బంది, 600 మంది పారామిలటరీ, స్థానిక పోలీసులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నట్టు ఆర్వో బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.

మొత్తం ఓటర్లు 2,11,932 మంది..

నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,11,932 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 1,04,391 మంది, మహిళలు 1,07,523 మంది ఇతరులు 18 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 3,132 మంది ఎక్కువ ఉన్నారు. చల్లపల్లి మండలంలో అత్యధికంగా 42,576 మంది ఉండగా, నాగాయలంక మండలంలో 39,013 మంది, కోడూరులో 36,084 మంది, ఘంటసాలలో 33,229 మంది, అవనిగడ్డలో 31,639మంది, మోపిదేవి మండలంలో అత్యల్పంగా 28,623 మంది ఓటర్లున్నారు. మండలానికి ఒకటి చొప్పున ఆరు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, చల్లపల్లిలో ప్రత్యేకంగా మహిళల కోసం ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

కొత్త ఓటర్లు 4,572 మంది..

నియోజకవర్గంలో కొత్తగా ఓటు హక్కు పొందిన వారు 4,572 మంది ఉన్నారు. వీరిలో యువకులు 2,520 మంది ఉండగా, యువతులు 2,052 మంది ఉన్నారు.

» ఈ ఎన్నికల్లో ఏడుగురు శతాధిక వృద్ధులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కోడూరు మండలం నరసింహపురానికి చెందిన భూపతి సీతారామయ్య 109 సంవత్సరాలు ఉండగా, నాగాయలంక మండలం బర్రంకులకు చెందిన అప్పికట్ల సామ్రాజ్యం 104, వేకనూరుకు చెందిన భోగాది వెంకాయమ్మ 102, ఘంటలసాలకు వేమూరి రత్నం 102, అవనిగడ్డకు చెందిన అర్జా లక్ష్మి, ఉల్లిపాలెంకు చెందిన గుడిసేవ లక్ష్మమ్మ, పెదకమ్మవారిపాలెంకు చెందిన నాగమ్మ 101 సంవత్సరాలు వయస్సు కలిగి ఉన్నారు.

ఆరు మండలాల్లో 267 పోలింగ్ కేంద్రాలు

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 267 పోలింగ్ కేంద్రాలున్నాయి. 1 నుంచి 44 వరకూ పోలింగ్ బూత్‌లు ఘంటసాల మండలంలో ఉండగా, 45 నుంచి 94 పోలింగ్ బూత్‌లు చల్లపల్లిలో, 95 నుంచి 132 వరకూ మోపిదేవిలో, 133 నుంచి 170 వరకూ అవనిగడ్డలో, 171 నుంచి 218 వరకూ కోడూరులో, 219 నుంచి 267 వరకూ నాగాయలంక మండలంలో ఉన్నాయి.

పెడనలో..

పెడన:పెడన నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని సోమవారం జరగనున్న పోలింగ్ సరంజామను సంబంధిత సిబ్బంది తీసుకెళ్లారు. పెడన వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనికి ఉదయం 7 గంటల నుంచే పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, పోలీసులు చేరుకున్నారు. పెడన ఎన్నికల అధికారి పి.వెంకటరమణ ఆదేశాల మేరకు 22 కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఒక్కో రూట్‌కు ఒక కౌంటరు ఏర్పాటు చేయడంతో పీవోలు, ఏపీవోలు తమకు అప్పగించిన ఎన్నికల సరంజామను తీసుకుని వాటిని సరిచూసుకుని అన్ని సక్రమంగా ఉన్నాయి లేనిది పరిశీలించుకున్నారు. మచిలీపట్నం పార్లమెంటు వ్యయ పరిశీలకులు జాన్ కింగ్స్ లే పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. పంపిణీ కేంద్రంలో ఏర్పాట్లను ఈఆర్వో వెంకటరమణ పరిశీలకునికి వివరించారు. మధ్యాహ్నం భోజనం అనంతరం ఎన్నికల సిబ్బంది తమకు అప్పగించిన సామగ్రితో ఆయా 22 రూట్లలో 67 బస్సుల్లో 216 పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. అందరూ కూడా ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని రిపోర్టు చేయడంతో అంతా సక్రమంగా చేరినట్లు పైకి నివేదికలు పంపించారు. మరో పక్క పోలీస్ శాఖకు సంబంధించి మచిలీపట్నం ట్రైనీ డీఎస్పీ కె.రమేష్‌బాబు ఆధ్వర్యంలో ట్రైనీ ఐపీఎస్‌లు పోలీస్ సిబ్బందితో పాటు పారామిలటరీ, ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ సిబ్బందికి విధులు కేటాయించి పోలింగ్ కేంద్రాలు సూచించడంతో వారు పీవోలు, ఏపీలతో జాయిన్ అయ్యారు.

కృత్తివెన్ను: సార్వత్రిక ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తైనట్లు సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుందని తహసీల్దార్ సుందర్‌సింగ్ తెలిపారు. మండలంలో మొత్తం 46 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎన్నికల్లో మండల వ్యాప్తంగా మొత్తం 18,762 మంది పురుషులు, 18,616 మంది మహిళలు ,ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



సిబ్బందికి సామగ్రి అందజేస్తున్న దృశ్యం



సిబ్బందిని తరలించడానికి సిద్ధంగా ఉన్న బస్సులు



పోలింగ్ సామగ్రితో తరలివెళ్తున్న సిబ్బంది



నాగాయలంక మండలం భావదేవరపల్లిలో మోడల్ పోలింగ్ స్టేషన్ స్వాగత ద్వారం

కోడూరులో..

కోడూరు: మండలంలోని 13 పంచాయతీలకు సంబంధించి 48 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఎన్నికల్లో 36,272మంది ఓటు హక్కును వినియోగించుకునున్నట్లు చెప్పారు. 48 పోలింగ్ బూత్‌లకు సంబంధించి 288మంది పోలింగ్ సిబ్బందిని నియమించారని, ప్రతి బూత్ వద్ద పోలీసులు, ఎన్‌సీసీ సిబ్బంది అదనంగా ఉంటారని తహసీల్దార్ తెలిపారు. బీఎల్వోల పర్యవేక్షణలో బూత్ వద్ద ప్రత్యేక టెంట్లు ఏర్పాటు చేయడంతో పాటు ఓటర్లకు అవసరమైన తాగునీటిని కూడా సరఫరా చేయడానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.



చినగుడుమోటులోని పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేసుకుంటున్న పోలింగ్ సిబ్బంది

మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. గత ఎన్నికల్లో జరిగిన అల్లర్లను పరిగణలోకి తీసుకొని మండలంలో మందపాకల, వి.కొత్తపాలెం, విశ్వనాథపల్లి, చినగుడుమోటు, పెదగుడుమోటు, కోడూరులోని తొమ్మిద వార్డు కేంద్రాల వద్ద కేంద్ర బలగాలు మోహరించారు. ఏవిధమైన అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శిరీష హెచ్చరించారు. ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టించినవారిపై రౌడీషీట్ కూడా తెరుస్తామని హెచ్చరించారు. రూట్ ఆఫీసర్లు, బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బందికి అవసరమైన వసతులను సమకూర్చారు.

ఘనంగా శంకర జయంతి



ఉంగుటూరు: మండలంలో ఆత్కూరు శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో శంకర జయంతిని పురస్కరించుకుని ఆదివారం శివుని అభిషేకం చేశారు. ఆది గురువు శంకరాచార్యుల బోధనలు హిందూ ధర్మానికి నలు దిక్కుల దీపస్తంభాలుగా పనిచేశాయని కొనియాడారు. కొద్దిసేపు వారిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పన్యారం విష్ణుమూర్తి, గోపరాజు సత్యపవన్, మామిళ్లపల్లి సుబ్బారావు, యామర్తి వకుళ, స్వర్ణ చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

యనమలకుదురులో..

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసిఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో ఆదివారం జగద్గురు ఆదిశంకరాచార్యులు జయంతి ఘనంగా చేశారు. ఉదయం శ్రీఆదిశంకరచార్యుల వారికి ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం వేద పండితులకు ఘనంగా సన్మానం చేశారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శ్రీ రామలింగేశ్వరస్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అత్యంత వైభవంగా చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వి.సాగర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి దాత, ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదాలు భక్తులకు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గంగాధరరావు, భక్తులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు ఉదయానికే ఆలయానికి చేరుకోవడంతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. స్వామి వారి పుట్టలో పాలు పోసేందుకు, పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారు చేయడానికి అధిక సమయం వేచి ఉన్నారు. స్వామిని దర్శించుకున్న అనంతరం నాగబంధాల వద్ద పూజలు చేశారు. గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య, సిబ్బంది పర్యవేక్షించారు.

ఉచిత వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యాన స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో వందలాది మంది రోగులకు గుడివాడ వైద్యురాలు డాక్టర్ గవిర్నేని రజినీ వైద్య పరీక్షలు చేశారు. రోగులకు ఉచిత మందుల పంపిణీ చేశారు.

భావదేవరపల్లిలో మోడల్ పోలింగ్ స్టేషన్

నాగాయలంక మండలంలో ఓటు హక్కు వినియోగించుకోనున్న 39,232 మంది

నాగాయలంక: సాధారణ ఎన్నికల–2024 ప్రక్రియలో భాగంగా మండలంలోని భావదేవరపల్లిలో సర్వాంగ సుందరంగా ఆధునిక రీతిలో మోడల్ పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. గ్రామంలోని 231వ పోలింగ్ కేంద్రాన్ని దీనికోసం ఎంచుకున్నారు. ఈ బూత్‌లో 799 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకుంటారు. వీరిలో 414 మంది మహిళా ఓటర్లు, 385 మంది పురుషులు ఉన్నారు. ఇక్కడ కేంద్రం ముఖ ద్వారంలో ఓటర్లను ఆహ్వానిస్తూ స్వాగత ద్వారం అమర్చారు. లోపలా బయటా మామిడి తోరణాలు అలంకరించారు. పోలింగ్ బూత్ లోపలా బయటా గ్రీన్ కార్పెట్లు, ఇతర అలంకరణలతో ఆకర్షణీయంగా తీర్చి దిద్దారు. ఓటర్ సహాయక డెస్క్‌ను ప్రత్యేకంగా పెట్టారు. ఓటర్లలో అవగాహన కల్పించడానికి మండలానికి ఒకటి మోడల్ పోలింగ్ బూత్ కేటాయించినట్లు గ్రామ రెవెన్యూ అధికారి జి.తిరుమలరావు చెప్పారు. మండలంలోని 49పోలింగ్ బూత్‌లలో సోమవారం తమ ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు. మండలంలో మొత్తం ఓటర్లు 39,232 మంది కాగా పురుషులు 19,733 మంది, స్త్రీలు 19,499 మంది ఉన్నారు. మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించే క్రమంలో విస్తృత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు స్థానిక ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని 39 పోలింగ్ లొకేషన్స్ పరిధిలో 39 మంది బృందం పోలీస్ స్టాఫ్‌లో ఒక ఏఎస్ఐ, ఎనిమిది మంది కానిస్టేబుళ్లు, 30మంది హోమ్ గార్డులు ఎన్నికల విధుల్లో ఉంటారు. అదనంగా కేంద్ర పోలీసు బలగాలకు చెందిన ఫోర్స్ 16 మంది, సేవల్లో 49మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అయిదు రూట్ మొబైల్స్ ఒక్కో దానిలో ఇద్దరు ఎస్ఐలు, 8మంది పీసీలతో 10మంది చొప్పున బందోబస్త్‌లో ఉంటారు. ఒక సీఐ, ముగ్గురు పీసీలతో ఒక స్ట్రైకింగ్ ఫోర్స్ నిరంతరం తిరుగుతందని ఎస్ఐ వివరించారు.



మోడల్ పోలింగ్ స్టేషన్‌లో ఓటర్ సహాయ డెస్క్

ముగిసిన గంగానమ్మ అమ్మవారి తిరునాళ్ల



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ఐదుదు రోజులుగా జరుగుతున్న గంగానమ్మ అమ్మవారు తిరునాళ్ల ఆదివారం శాంతి కల్యాణంతో ముగిసింది. ఉదయం శ్రీ అశ్వద్ధ నాగలింగేశ్వరస్వామి వారికి శాంతి రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గంగానమ్మ ఆశీస్సులు స్వీకరించారు. అనంతరం వైశాఖ శుద్ధపంచమి జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్య స్వామి వారి జయంతి, శ్రీ రామానుజాచార్య స్వామివారి జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలతో తిరునాళ్ల ముగిసింది.

పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది



పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రంలో వేచి ఉన్న సిబ్బంది



పోలింగ్ సామగ్రితో సిబ్బంది

ప్రత్యేక బస్సుల్లో కేంద్రాలకు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల పోలింగ్ నిర్వహణకు నియమించిన ఉద్యోగులు, సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు ఆదివారం తరలివెళ్లారు. నగరంలోని నోబుల్ కళాశాల ఆవరణలో పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు వెళ్లే సిబ్బందికి ఈ సామగ్రిని అందజేశారు. ఈవీఎం, వీవీ ప్యాట్లు తదితర పరికరాలతో సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో తరలి వెళ్లారు. వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని సోమవారం ఉదయం నిర్వహించాల్సిన మాక్ పోలింగ్ ఏర్పాట్లను చేసుకున్నారు. పోలీస్ సిబ్బంది కూడా కేంద్రాలకు చేరి బందోబస్తుకు సన్నద్ధమయ్యారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని బందరు ఆర్డీఓ వాణి పర్యవేక్షించారు.

కొండలమ్మకు మొక్కుల సమర్పణ

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకునేందుకు ఆలయంలో ఆదివారం క్యూలో భక్తులు అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

నాడు మల్లేశ్వరం.. నేడు పెడన

- ఇప్పుడు 1,67,564 మంది ఓటర్లు
- 1952లో మచిలీపట్నం నియోజకవర్గం.. ఆ తర్వాత మల్లేశ్వరం



పెడన: నాడు మల్లేశ్వరం.. నేడు పెడన నియోజకవర్గంగా మారింది. 2009లో ఈ నియోజకవర్గం ఏర్పడింది. అంతకు ముందు అంటే 1952లో మచిలీపట్నం నియోజకవర్గంలో ఉండేది. అప్పట్లో కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉండటంతో గుండాబత్తుల ఆంజనేయులు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆ తర్వాత మచిలీపట్నం నియోజకవర్గం నుంచి 1955లో మల్లేశ్వరంగా ఏర్పడింది. దీనిలో పెడన మండలంతో పాటు బంటుమిల్లి, కృత్తివెన్ను, గూడూరు మండలాలుండేవి. బంటుమిల్లి మండలం మల్లేశ్వరం నియోజకవర్గ కేంద్రంగా ఉండేది. పెడన పట్టణం మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉండేది. 2009లో నియోజకవర్గాల పునర్‌విభజన తర్వాత పెడన నియోజకవర్గం ఏర్పడింది. పట్టణంతో పాటు పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, గూడూరు మండలాలతో కలిపి పెడన అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పడింది.

అప్పటి నుంచి రాజకీయ పోరు

రాజకీయ పోరులో 1952 నుంచి 1983 వరకు కూడా కమ్యూనిస్టులు, కాంగ్రెస్(ఐఎన్‌సీ), జనతా పార్టీలే ఆధిపత్యంలో ఉండేవి. వీరితో స్వతంత్ర అభ్యర్థులు తామేమి తీసిపోలేదన్నట్లుగా గెలుపొందారు. అనంతరం టీడీపీ ఏర్పాటు తర్వాత కమ్యూనిస్టులు కనుమరుగవుతూ వచ్చారు. 1983 నుంచి 2009 వరకు టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు హోరాహోరీగా ఉండాయి. రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ అడ్రస్ గల్లంతైంది. ఇదే సమయంలో ఆవిర్భవించిన యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ, టీడీపీ హోరాహోరీగా తలపడుతూ వచ్చాయి. 1952లో గుండాబత్తుల ఆంజనేయులు మచిలీపట్నం నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నారు.

పెరుగుతున్న ఓటర్లు

మొట్టమొదటి మల్లేశ్వరం ఎమ్మెల్యేగా కృత్తివెన్ను మండలం మునిపెడ గ్రామనికి చెందిన పిన్నింటి పమిడేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ నుంచి 8,254 ఓట్ల మెజార్టీతో ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో మొత్తం ఓటర్లు 58,215 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. 1962లో 69,389 మంది ఓటర్లు ఉండేవారు. రెండో సారి పిన్నింటి పమిడేశ్వరరావు కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా 3,706 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆ తర్వాత 1967లో గూడూరు మండలం కంకటావ గ్రామానికి చెందిన బూరగడ్డ నిరంజనరావు స్వతంత్ర అభ్యర్థిగా 8,190 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ సంవత్సరంలో 82,701కి ఓటర్లు చేరారు. 1972లో 95,012 ఓటర్లు చేరారు. పిన్నింటి పమిడేశ్వరరావు తిరిగి మూడోసారి ఎమ్మెల్యేగా 6,347ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 1978లో బూరగడ్డ నిరంజనరావు జనతాపార్టీ నుంచి ఎమ్మెల్యేగా 3,222 ఓట్ల మెజార్టీతో ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో మొత్తం ఓటర్లు 94,048 మంది ఓటర్లు ఉన్నారు. 1982లో టీడీపీ ఏర్పాటు అవ్వగా పెడన మండలం దావోజిపాలెంకు చెందిన అంకెం ప్రభాకరరావు టీడీపీ మద్దతుతో 1983లో 1,172 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ ఏడాది ఎన్నికల్లో 98,223 ఓటర్ల సంఖ్య చేరుకుంది. 1985లో 1,04,680కి ఓటర్ల సంఖ్య చేరింది. ఈ ఏడాదిలో టీడీపీ నుంచి కాగిత వెంకట్రావు 1,229 మెజార్టీ ఓట్లతో ఎమ్మెల్యే అయ్యారు. 1989లో బూరగడ్డ వేదవ్యాస్ కాంగ్రెస్ నుంచి పోటీ చేసి 4,998 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. ఈ సంవత్సరంలో ఓటర్లు సంఖ్య 1,21,864కు చేరింది. ఆ తర్వాత 1994లో జరిగిన ఎన్నికల్లో 1,21,863 ఉంది. గత ఎన్నికల కంటే ఈ సంవత్సరం ఎన్నికల్లో ఒక ఓటరు మాత్రమే తగ్గారు. అదే ఏడాదిలో టీడీపీ నుంచి కాగిత వెంకట్రావు 8,111 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. 1999లో 1,32,527కు ఓటర్ల సంఖ్య చేరింది. టీడీపీ నుంచి కాగిత వెంకట్రావు 669 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి బూరగడ్డ వేదవ్యాస్ 23,801 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. కిందటి ఎన్నికల కంటే ఈ ఏడాదిలో ఓటర్లు సంఖ్య తగ్గింది. 1,32,242 మంది ఉన్నారు.

పెడన ఏర్పడిన తర్వాత..

2009లో మల్లేశ్వరం.. పెడన నియోజకవర్గంగా ఏర్పడింది. దీంతో ఇక్కడ ఓటర్ల సంఖ్య 1,47,074కు చేరింది. పెడన నియోజకవర్గం మొట్టమొదటి ఎమ్మెల్యేగా జోగి రమేష్ కాంగ్రెస్ నుంచి పోటీ చేసి 1,192 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2014 ఎన్నికల్లో 1,56,795కు ఓటర్ల సంఖ్య చేరుకోగా టీడీపీ అభ్యర్థి కాగిత వెంకట్రావు 13,694 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. 2019 ఎన్నికలలో జోగి రమేష్ వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసి 7,843 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. ఈ ఎన్నికలలో 1,66,177కు ఓటర్లు సంఖ్య చేరుకుంది.

తాజాగా ఓటర్లు సంఖ్య 1,67,564

ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల్లో పెడన నియోజకవర్గంలో ఓటర్లు 1,67,564కు చేరింది. వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము), టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్‌లతో పాటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శొంఠి నాగరాజులతో మరో ఏడుగురు బరిలో ఉన్నారు. ఎవరు గెలిచినా కూడా 8వ ఎమ్మెల్యేగా పేరు తెచ్చుకోనున్నారు.

ఆకట్టుకుంటున్న మహిళా పోలింగ్ స్టేషన్



చల్లపల్లి: చల్లపల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని భవనంలో ప్రత్యేకంగా మహిళా పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్, ఎంపీడీఓ ఆధ్వర్యంలో 72వ నెంబరు పోలింగ్ కేంద్రాన్ని పింక్ పోలింగ్ స్టేషన్‌గా తీర్చిదిద్దారు. మండలంలో మహిళా ఓటర్లు అత్యధికంగా ఉన్న పోలింగ్ బూత్ కావటంతో మహిళా పోలింగ్‌స్టేషన్‌గా తీర్చిదిద్దారు. ఈ పోలింగ్ కేంద్రంలో మహిళా ఓటర్లు 713 మంది, పురుష ఓటర్లు 629 ఉన్నారు.